సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం



బుధవారం । 8 । మార్చి । 2023

తలెత్తుకుంటాం.. తాట తీస్తాం!



- మళ్లీ పుడితే ఆడజన్మే కోరుకుంటాం
- అధికారం ఇస్తే కఠిన శిక్షలు అమలు
- వేధింపులు ఉన్నా.. ఎదుర్కొంటున్నాం

'సాక్షి' సర్వేలో మహిళల మనోగతం



ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో సర్వేలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు (ఇన్‌సెట్) సర్వేలో పాల్గొన్న కొత్తగూడెం ఆర్టీసీ డిపో మహిళా ఉద్యోగులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అవనిలో సగం.. ఆకాశంలో సగం అని చెబుతున్నా అక్కడక్కడా వివక్ష కొనసాగుతూనే ఉంది. అయినప్పటికీ వివక్షను ఎదుర్కొంటూ స్వతంత్ర భావాలతో జీవిస్తున్నాం. అయితే, తమకే కనుక అవకాశం ఇస్తే కలల సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటాం.. హింసకు పాల్పడే వారికి కఠిన శిక్షలు అమలు చేస్తాం.. అంటున్న మహిళలు మళ్లీ జన్మించే అవకాశం వస్తే కనక ఆడజన్మనే కోరుకుంటామని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు తది తర చోట్ల సర్వే నిర్వహించింది. మొత్తం 200 మందిని సర్వే చేయగా మళ్లీ జన్మంటూ ఉంటే ఎలా పుట్టాలనుకుంటున్నారు? అనే ప్రశ్నకు 82.5 శాతం(165) మంది ఆడపిల్లగానే జన్మించాలని ఉందని చె ప్పడం మహిళా సాధికారతకు దర్పణం పడుతోంది.

స్వాతంత్ర్యం.. సగమే

సమాజంలో వివక్ష ఉన్నా స్వతంత్రంగా జీవించగలుగుతున్నామని 49 శాతం మంది మహిళలు చెప్పగా.. కొంత మేర స్వాతంత్ర్యం ఉందని 25.5 శాతం మంది.. అలా జీవించలేకపోతున్నామని మిగతా వారు తెలిపారు. ఇక అధికారం అప్పగిస్తే ఏం చేస్తారన్న ప్రశ్నకు మహిళలపై హింస, ఇతర నేరాలకు కఠిన శిక్షలు అమలు చేస్తామని 54.5 శాతం మంది, వివక్ష లేని సమాజాన్ని ఏర్పాటు చేస్తామని 19.5 శాతం మంది, ఆడపిల్లలకు ఉచిత విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని 19.5 శాతం మంది, ఆడవారికి నెలలో నాలుగు రోజులు సెలవు(నెలసరి సమయంలో) ఇస్తామని 6.5 శాతం మంది పేర్కొన్నారు.

ఇంట వివక్ష.. బయట వేధింపులు..

సర్వేలో ప్రధానంగా మహిళలు పని ప్రదేశాలు, విద్యాలయాలు, ప్రయాణ సమయాల్లోనే సోషల్ మీడియాతో ఎక్కువగా వేధింపులకు గురవుతున్నట్లు వెల్లడైంది. మహిళగా ఎక్కువగా ఇబ్బంది ఎదుర్కొన్న అంశం ఏమిటనే ప్రశ్నకు కళాశాలలు, పని ప్రదేశాలు, ప్రయాణాల్లో ఇలా ప్రతిచోట టీజింగ్‌తో ఇబ్బంది ఎదుర్కొన్నట్లు 50.5 శాతం మంది మహిళలు అభిప్రాయపడ్డారు. చిన్నప్పుడు ఇంట్లోనే ఆడా, మగ వివక్షకు గురైనట్లు 33 శాతం మంది చెప్పగా.. సోషల్ మీడియాతో 16.5 శాతం మంది మహిళలు వేధింపులకు గురవుతున్నట్లు తేలింది.

పేరుకే సమానత్వం..



సమాజంలో మహిళలు, పురుషులకు అన్నింట్లో సమానత్వం ఉందని చెబుతున్నా అది మాటలకే పరిమితమవుతోంది. అయితే, మహిళగా ఎన్ని ఇబ్బందులు పడినా మళ్లీ జన్మంటూ ఉంటే మహిళగానే పుట్టాలనేది నా ఆకాంక్ష. మహిళలను ప్రోత్సహిస్తే అన్నింటా ముందుంటారని ఎందరో నిరూపించారు.

– పి.అనిత, కండక్టర్, ఖమ్మం ఆర్టీసీ డిపో

మహిళతోనే సామాజికాభివృద్ధి..



సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళలతోనే సాధ్యం. కుటుంబం, సమాజాన్ని నిర్మించడంలో మహిళలది కీలక పాత్ర. అమ్మాయిలపై దాడులు, హింసను అరికట్టాల్సిన అవసరముంది. ఆడా మగ సమానమేనని గుర్తించి కుటుంబంలో కూడా అందరి చదువుకు ప్రాధాన్యమివ్వాలి. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి.

– సీహెచ్.సంధ్యారాణి, డీడబ్ల్యూసీఓ, ఖమ్మం

మహిళలకు రక్షణ కల్పించాలి



యువతులు, మహిళలకు రక్షణ కల్పించేందుకు పాలకులు కొత్త చట్టాలను ప్రవేశపెట్టాలి. ప్రస్తుత పరిస్థితుల్లో జరుగుతున్న పరిణామాలు చూస్తే బాధ కలుగుతోంది. ఈ విషయంలో పాలకులు స్పందించి యువతులు, మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకుని చట్టాలను తీసుకొస్తే సమాజంలో వారు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంటుంది.

– కె.నందిని, డిగ్రీ సెకండియర్, ఆర్‌జేసీ కళాశాల, ఖమ్మం

అన్యాయంపై పోరాడాలి..



మహిళగా స్వతంత్రంగా జీవించగలుగుతున్నా. అందుకే మరో జన్మంటూ ఉంటే ఆడపిల్లగానే పుట్టాలనుంది. పని ప్రదేశాల్లో మహిళలు వివక్షకు గురవుతున్నట్లు తెలుస్తున్నా దీనిని ధైర్యంగా ఎదుర్కోవాలి. మహిళల రక్షణకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకొచ్చాయి. అలాగే, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్.అంజలి, ట్రాఫిక్ సీఐ, ఖమ్మం

చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి..




ప్రస్తుతం మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించడమే కాదు.. పలు సందర్భాల్లో ఆదర్శంగా నిలుస్తున్నారు. అయినా ఇంకా మహిళలపై దాడులు జరుగుతుండగా, అక్కడక్కడా వివక్షకు గురవుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు మహిళల భద్రతా చట్టాలను మరింత పటిష్టంగా అమలుచేయాలి.

– ఈ.సునీత, ఆర్టీసీ ఉద్యోగి, కొత్తగూడెం

సర్వే సాగింది ఇలా..

1. మీరు మీకు నచ్చిన రీతిలో స్వతంత్రంగా జీవించగలుగుతున్నారా?



■ అవును ■ లేదు ■ కొద్దిమేర

2. మహిళగా మిమ్మల్ని ఎక్కువగా ఇబ్బంది పెట్టిన అంశం




■ చిన్నప్పుడు ఇంట్లోనే ఆడామగ వివక్ష
■ కాలేజీ, పనిప్రదేశం, ప్రయాణంలో టీజింగ్
■ సోషల్ మీడియా టీజింగ్

3. మీకే పూర్తి అధికారం ఉంటే మహిళల కోసం ఏం చేస్తారు?



■ ఆడా మగ వివక్ష లేని సమాజాన్ని ఏర్పాటు చేయడం
■ మహిళలపై హింస,ఇతర రకాల నేరాలకు కఠిన శిక్షలు
■ ఆడ పిల్లలకు ఉచిత విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు
■ ఆడ వారికి నెలలో 4 రోజులు పూర్తి సెలవు (నెలసరి సమయంలో)

4. మళ్లీ జన్మంటూ ఉంటే ఎలా పుట్టాలనుకుంటున్నారు?



■ మళ్లీ ఆడపిల్లలాగే
■ మగపిల్లాడిలా

విజయ గీతిక లిఖిద్దాం..



'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా పేజీ లే ఔట్‌ను పరిశీలిస్తున్న ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి డానీరూత్

- బాధిత మహిళలకు అండగా నిలవడమే కర్తవ్యం
- ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి డానీరూత్

మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా విధులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'మహిళలు తమకు ఎదురయ్యే ఘటనలతో కుంగిపోకుండా.. విధిరాతను ఎదిరిస్తూ విజయ గీతికను లిఖించుకోవాలి.. ఆత్మవిశ్వాసం, పట్టుదలతో సాగితే మహిళలు ఎందులోనూ తీసిపోరు.. ఇదే విషయాన్ని నా దగ్గరకు వచ్చే వారికి చెబుతుంటాను.' అని ఖమ్మం ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.డానీరూత్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం 'సాక్షి' యూనిట్ కార్యాలయంలో ఆమె గెస్ట్ ఎడిటర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పేజీ లే ఔట్, మహిళా దినోత్సవ ప్రత్యేక కథనాలపై చర్చించిన ఆమె సూచనలు చేశారు.

అన్ని అవకాశాలు రావాలి...

మహిళలు ధైర్యవంతులుగా మారాలని, సమస్యలకు కుంగిపోకుండా ధైర్యంగా నిలబడాలని డానీరూత్ సూచించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహిళల గాథలను విన్నప్పుడు మరింత ప్రేరణ కలుగుతుందన్నారు. మహిళల స్థితిగతులు మారకుంటే సమాజం అభివృద్ధి చెందదని, సమాజ నిర్మాణంలో సగభాగమైన మహిళ ప్రగతికి మూలమని తెలిపారు. ఆడ, మగ తారతమ్యం ఉండకూడదని, అన్నిరంగాల్లో భాగస్వామ్యాన్ని కల్పిస్తే మహిళలు తమ సమస్యలను తామే పరిష్కరించుకోగలుగుతారని చెప్పారు. అయితే, మహిళలకు ఇంకా కొన్నిరంగాల్లో అవకాశాలు రావాల్సిన అవసరముందని ఆమె అభిప్రాయపడ్డారు.

బాధ్యతల వైపు అడుగులేసి..

న్యాయమూర్తి ఆర్.డానీరూత్ 18 ఏళ్ల వయసులో డిగ్రీ చదువుతుండగా ప్రేమ వివాహం చేసుకున్నారు. డిగ్రీ అనంతరం విజయనగరంలో ఎల్ఎల్‌బీ చదివారు. ఆ సమయంలో వారికి ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. అనంతరం న్యాయవాదిగా 1995లో విజయనగరంలో ఎన్‌రోల్ అయ్యారు. ఏడేళ్లపాటు ప్రాక్టీస్ చేశారు. ఆ సమయంలో మూడో కుమార్తె జన్మించింది. మొదటి ప్రయత్నంలోనే 2003లో డానీరూత్ న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. అదే ఏడాది భర్త మరణించడం డానీరూత్‌ను కుంగదీసింది. దీంతో దుఃఖంలో మునిగినా.. ముగ్గురు ఆడపిల్లల బాధ్యత ఉండటంతో బాధను దాచుకుంటూ రోజువారీ పనులు కొనసాగించారు. ఓవైపు న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తూనే.. ముగ్గురు పిల్లలకు మంచి భవిష్యత్ ఇచ్చేలా ఉన్నత చదువులు చదివేలా ప్రేరేపించారు.

కుమార్తెలకు రోల్‌మోడల్

డానీరూత్ తన ముగ్గురు కుమార్తెలకు మార్గదర్శకురాలిగా నిలిచారు. మొదటి కుమార్తె తల్లి స్ఫూర్తితో హార్టికల్చర్ పూర్తిచేశాక ఎల్ఎల్‌బీ చదివారు. రెండో కుమార్తె బీహెచ్ఎంఎస్ పూర్తిచేయగా, మూడో కుమార్తె సైతం ఎల్ఎల్ఎం పూర్తిచేసి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. కాగా, తనకు రిటైర్డ్ హైకోర్టు జడ్జి రజిని స్ఫూర్తిగా నిలిచారని డానీరూత్ ఈ సందర్భంగా తెలిపారు. 'కెరటం నా ఆదర్శం.. లేస్తూ పడుతుందని కాదు.. పడుతూ లేస్తుందని' అనే సూక్తిని ఉటంకించిన ఆమె.. మహిళలు తమకు ఎదురవుతున్న అడ్డంకులను అధిగమిస్తూ వెళితే విజయం సొంతమవుతుందని వెల్లడించారు.

ఇదో కొత్త అనుభూతి

మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక పేజీలు, కథనాల రూపకల్పనలో పాలుపంచుకోవడం కొత్త అనుభూతిని ఇచ్చిందని ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.డానీరూత్ వెల్లడించారు. ప్రతీ చోట మహిళలకు దక్కాల్సిన గౌరవం అందితే సమాజం బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. మహిళలు ఇంట్లో ఉండడం కాదని, సమాజంలోకి వచ్చి తమ కలలను సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకుని అందివచ్చిన అవకాశాలను ఒడిసి పట్టుకుంటే అద్భుతమైన సమాజం ఆవిష్కృతమవుతుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

జిల్లాలో ఐదు మహిళా క్లినిక్‌లు

- నేటి నుంచి వైద్య సేవలు ప్రారంభం

చుంచుపల్లి: అనారోగ్యంతో బాధ పడుతున్న మహిళలు, గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఐదు ఆరోగ్య మహిళా క్లినిక్‌లను బుధవారం ప్రారంభించనుంది. ఆయా పీహెచ్‌సీల్లోనే ఈ క్లినిక్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం జిల్లాలోని ఎర్రగుంట, పర్ణశాల, పెనగడప, ఎంపీ బంజర, కొమరారం ఆస్పత్రులను ఎంపిక చేశారు. ఇందులో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షల నిర్వహణతో పాటు మందులు పంపిణీ చేయనున్నారు. రక్తహీనత, థైరాయిడ్, పౌష్టికాహార లోపం, కేన్సర్ నిర్ధారణ, అయోడిన్, ఫోలిక్ యాసిడ్, ఐరన్ లోపం, మూత్రపిండాల్లో ఇన్ఫెక్షన్లు, మెనోపాజ్ సమస్యలు, రక్తపోటు, గర్భాశయ, ఎముకల సమస్య తదితర వ్యాధులను గుర్తించి మందులు అందిస్తారు. వీరికి ప్రతి మంగళవారం ప్రత్యేక వైద్య సేవలందిస్తారు. సమస్య తీవ్రంగా ఉంటే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలిస్తారు. ఇందుకోసం సర్వజన ఆస్పత్రిలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. అక్కడ కూడా జబ్బు నయం కాకుంటే హైదరాబాద్‌కు పంపిస్తారు.

విద్యుత్ ఉద్యోగుల పీఆర్‌సీపై 10న మళ్లీ చర్చలు

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగుల పీఆర్‌సీపై రెండో దఫా చర్చలు జరిపేందుకు జేఏసీ నేతలకు యాజమాన్యం ఆహ్వానం పంపింది. హైదరాబాద్‌లో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి తదితరులు సోమవారం జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఆందోళన కార్యక్రమాలను యథాతథంగా నిర్వహిస్తామని జేఏసీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో 10వ తేదీన మరోసారి చర్చలకు రావాలని యాజమాన్యం ఆహ్వానించడంతో ఇప్పుడైనా న్యాయం జరిగేనా అని ఉద్యోగులు, కార్మికులు ఆశగా ఉన్నారు. కాగా, 10వ తేదీ చర్చలను బట్టి తమ భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని జేఏసీ నేతలు తెలిపారు.

మహిళా సంఘాలకు ఊరట

- ఎస్‌హెచ్‌జీలకు రెండేళ్ల వడ్డీ బకాయిల విడుదల
- జిల్లాకు రూ.14.96 కోట్లు మంజూరు



సమావేశమైన ఎస్‌హెచ్‌జీ సభ్యులు (ఫైల్)

చుంచుపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా స్వయం సహాయ సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. జిల్లాలోని సంఘాలకు రెండేళ్ల వడ్డీ బకాయిలు రూ.14.96 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా రాయితీ బకాయిల కోసం ఎదురుచూస్తున్న మహిళా సంఘాలకు కొంత ఊరట లభించినట్టయింది. మహిళా సంఘాలకు గత నాలుగేళ్లుగా ప్రభుత్వం వడ్డీ రాయితీలను జమ చేయడం లేదు. 2018 నుంచి ఈ బకాయిలు విడుదల కావాల్సి ఉంది. తొలి విడతగా 2018 – 19, 2019 – 20 సంవత్సరాలకు సంబంధించిన బకాయిలను విడుదల చేసింది. మరో రెండేళ్ల వడ్డీ రాయితీ రావాల్సి ఉంది. ప్రభుత్వం ప్రతి ఏడాది బ్యాంకు లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు విరివిగా రుణాలు అందజేస్తుంది. రుణాలు పొందిన మహిళలు వడ్డీతో సహా నెల నెలా వాయిదాలు చెల్లిస్తున్నారు. వాటికి సంబంధించిన రాయితీ వడ్డీని ప్రభుత్వం తిరిగి చెల్లించాలి. వాటికోసం గత నాలుగేళ్లుగా మహిళా సంఘాలు ఎదురుచూస్తున్నాయి. ఈ తరుణంలో రాష్ట్ర మంత్రి హరీష్ రావు మహిళా సంఘాలకు వడ్డీ రాయితీ విడుదల చేస్తున్నట్లు రెండు రోజుల క్రితం ప్రకటించారు. జిల్లాలో ప్రస్తుతం 18,515 ఎస్‌హెచ్‌జీల పరిధిలో 1.80 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వారికి రెండేళ్ల వడ్డీ బకాయిలు రూ. 14.96 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 2018 –19 సంవత్సరానికి అర్హత కలిగిన 10,619 మహిళా సంఘాలకు రూ.4.36 కోట్లు, 2019 – 20 సంవత్సరానికి అర్హత కలిగిన 10,415 ఎస్‌హెచ్‌జీలకు రూ.10.60 కోట్లు.. మొత్తం రూ.14.96 కోట్లు విడుదలయ్యాయి. చాన్నాళ్ల తర్వాత ప్రభుత్వం వడ్డీ రాయితీని విడుదల చేయడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం నేరుగా మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జి.మధుసూదన్ రాజు తెలిపారు.

వసంతమాడిన కలెక్టర్



క్యాంప్ కార్యాలయంలో హోలీ ఆడుతున్న కలెక్టర్ అనుదీప్ దంపతులు

హోలీ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ తన క్యాంప్ కార్యాలయంలో తన సతీమణి మాధవి, కుమారుడు అద్వైత్ శ్రీరామ్‌తో పాటు ఇతర అధికారులు, కలెక్టర్ పేషీ సిబ్బందితో కలిసి రంగులు చల్లుకుని సరదాగా గడిపారు. కలెక్టరేట్ ఏఓ గన్యా, డీసీహెచ్ రవిబాబునాయక్ తదితరులు కలెక్టర్‌కు రంగులు పూశారు. – కొత్తగూడెంరూరల్

నేత్రపర్వంగా శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించిన మండపంలో భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ స్థానాచార్యులు కే.ఈ.స్థలశాయి, వేద పండితులు గిరిధరాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ప్రసాదాచార్యులు తదితరులు శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. కాకర్లి వంశీయులు శివరాజ్ దంపతులు, శివాలయం పునఃనిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ మేనేజర్ పాకాల వెంకటరమణ పర్యవేక్షించారు. కల్యాణం అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ వనమా గాంధీ, కల్లోజి వెంకటేష్, దోసపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు..

బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం తెల్లవారుజాము నుంచే స్వామివారికి సుప్రభాతసేవ, అర్చన గావించారు. ధూప దీప నైవేద్యాలు, హోమాలు, నిత్య పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆ తర్వాత స్వామివారి కల్యాణానికి అవసరమైన పసుపు దంచే కార్యక్రమం(ఉలవకల్ల ఉత్సవం)లో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'ఆశ'కు రాష్ట్రస్థాయి అవార్డు

ఉత్తమ పురస్కారానికి ఎంపికైన కృష్ణవేణి



వైద్య సేవలు అందిస్తున్న ఆశ వర్కర్ కృష్ణవేణి

అశ్వాపురం: వేతనం తక్కువైనా ఆమె సేవలు ఘనం. అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న ఈ ఆశ కార్యకర్త అందరితో శెభాష్ అనిపించుకుంటోంది. అశ్వాపురం మండలం మొండికుంట ఆశ వర్కర్ మండల కృష్ణవేణి సేవలను గుర్తించిన ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపిక చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాలకు చెందిన 27 మందిని అవార్డులకు ఎంపిక చేయగా అందులో కృష్ణవేణికి స్థానం దక్కడం విశేషం. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో రూ. లక్ష నగదుతో పాటు బహుమతిని అందజేయనున్నారు. 1000 మందికి ఒక ఆశ వర్కర్ విధులు నిర్వర్తించాల్సి ఉండగా, కృష్ణవేణి 2500 మందికి సేవలు అందిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల కోసం గర్భిణులను దగ్గరుండి తీసుకెళుతూ ప్రత్యేక గుర్తింపు పొందింది. కరోనా సమయంలోనూ ఏ మాత్రం భయపడకుండా ఇంటింటికీ తిరిగి మందులు అందజేసింది. అధికారులు ఏ పని అప్పగించినా బాధ్యతతో చేస్తూ వారి మన్ననలు పొందుతోంది. ఇమ్యూనైజేషన్, ఇంటింటి సర్వే, వైద్య సేవల్లో ఉత్తమంగా విధులు నిర్వహిస్తోంది. కృష్ణవేణి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక కావడం పట్ల డాక్టర్ మణికంఠారెడ్డి, వైద్యాధికారి సంకీర్తన, సర్పంచ్ మర్రి మల్లారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాగా, తాను భవిష్యత్‌లో మరింతగా ఉత్తమ సేవలందిస్తానని కృష్ణవేణి 'సాక్షి'కి తెలిపింది.

భద్రగిరిలో ఉత్సవ శోభ..



తలంబ్రాలు కలుపుతున్న వైదిక సిబ్బంది సతీమణులు

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని మిథిలా స్టేడియంలో స్వామివారి కల్యాణోత్సవ శోభ మంగళవారం ప్రారంభమైంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది తలంబ్రాలు కలిపే కార్యక్రమానికి స్వామివారి ఉత్సవ మూర్తులను ఉత్తర ద్వారం వద్దకు తీసుకురావడంతో భక్తులు పులకించిపోయారు. అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించారు. 2లో

అతివలు.. అసాధ్యులు..!

● మొక్కవోని ధైర్యంతో ముందడుగు ● అవాంతరాలను ఎదుర్కొంటూ విజయతీరాలకు..

మహిళా దినోత్సవం

అందరికీ అన్నీ అందవు! కానీ వచ్చే ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటూ కొందరు విజయాలు సాధిస్తారు. అలాంటి వారిలో మహిళలెందరో ఉన్నారు. తల్లిదండ్రులు చదువు వద్దన్నా ఒప్పించిన వారు.. భర్త వదిలేసినా కుటుంబ సంసారాన్ని ఈదిన వారు.. తాము విజయం సాధించడంతో పాటు కుటుంబం, పిల్లలను వృద్ధిలోకి తీసుకొచ్చిన ఎందరో మన కళ్ల ముందే కనిపిస్తారు. అలాంటి వారిలో కొందరి విజయగాథలు నేడు మహిళా దినోత్సవం సందర్భంగా...

అక్కాచెల్లెళ్లు.. ఆఫీసర్లు



విద్యాలత, విద్యాచందన

చుంచుపల్లి: సత్తుపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులైన క్షీరసాగరయ్య – సుగుణకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉండగా.. ఇద్దరు కుమార్తెలు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మంలో జిల్లా స్థాయి అధికారులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో మెరుగు విద్యాలత భద్రాద్రి జిల్లా జెడ్పీ సీఈఓగా, విద్యాచందన ఖమ్మం డీఆర్డీఓగా ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులైన తమ తల్లిదండ్రులు క్రమశిక్షణతో పెంచారని, ఎక్కడ కూడా ఆడమగ వివక్ష చూపలేదని తెలిపారు. దీంతో ఉన్నత విద్యనభ్యసించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డామని పేర్కొన్నారు. ఇక తమ సోదరుడు ఆర్అండ్‌బీ శాఖలో ఈఈగా ఉన్నారని.. ముగ్గురం మంచి ఉద్యోగాల్లో స్థిరపడడానికి కష్టపడి చదువుకోవడం, అంది వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవడడమే కారణమని తెలిపారు. కాగా, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహిళలను అందరూ గౌరవించాలని, తల్లిదండ్రులు కూడా ఇళ్లలో ఆడ, మగ తేడా లేకుండా పెంచితే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారని విద్యాలత, విద్యాచందన వెల్లడించారు.

ఆదిలక్ష్మి.. మనోధైర్యంతో పలువురికి ఉపాధి

జూలూరుపాడు: జూలూరుపాడు మండలం కరివారిగూడెంకు చెందిన చింతల ఆదిలక్ష్మి మనోధైర్యంతో ముందుకు సాగుతోంది. ఏడేళ్ల క్రితం భర్త శ్రీను ఆమెతో పాటు ముగ్గురు పిల్లలను వదిలేసి వెళ్లిపోయాడు. భర్త శ్రీను బిల్డింగ్ నిర్మాణాలకు రాడ్‌బెండింగ్ పనులు చేసేవాడు. ఆ సమయాన పనిపై పట్టు సాధించిన ఆమె భర్త వదిలేశాక అదే పనిని వృత్తిగా మార్చుకుంది. కొన్నాళ్లు కూలీ పనులు చేసినా మూడేళ్లుగా ఆదిలక్ష్మి భవన నిర్మాణ పనులు సొంతంగా ఒప్పుకొని రాడ్‌బెండింగ్ మేస్త్రీగా మారింది. అంతేకాక తన వద్ద మరో పది మందికి ఉపాధి కల్పిస్తోంది. రాడ్‌బెండింగ్ పని కష్టతరమైనా ఏ మాత్రం తక్కువ కాదని నిరూపిస్తోంది. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు పనికి వెళ్లిన ఆమె తిరిగి రాత్రి ఇంటికి చేరుకుంటుంది. ఆమె పెద్ద కుమార్తె నవ్య బీటెక్ సెకండ్ ఇయర్, రెండో కుమార్తె సాయికీర్తి పదో తరగతి, కుమారుడు మణికంఠ 7వ తరగతి చదువుతున్నారు. తండ్రి వదిలేసి వెళ్లినా ఆమె తన ముగ్గురు పిల్లలను చదివిస్తూ ఉన్నత స్థానానికి చేర్చాలనే తపనతో కష్టపడుతోంది.



రాడ్‌బెండింగ్ పనులు చేస్తున్న ఆదిలక్ష్మి

నేడు సీటీ స్కాన్, రేడియాలజీ సేవలు ప్రారంభం



సీటీస్కాన్, రేడియాలజీ భవనం

చుంచుపల్లి: కొత్తగూడెం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో బుధవారం నుంచి సీటీస్కాన్, రేడియాలజీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఈ సేవలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ అనుదీప్, స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.కుమారస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో వైభవంగా చండీహోమం

పాల్వంచరూరల్ : మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయంలో ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం వైభవంగా చండీ హోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, వేద మంత్రాలతో అర్చకులు అమ్మవారు, స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా యాగశాలకు తీసుకొచ్చారు. మండపారాధన, గణపతి పూజ అనంతరం చండీహోమం, పూర్ణాహుతి జరిపించారు. హోమంలో 14 మంది భక్త దంపతులు పాల్గొనగా, వారికి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు


ఉత్సవ శోభ షురూ..



స్వామి వారి కల్యాణ తలంబ్రాలు కలుపుతున్న భక్తులు

భద్రగిరిలో శ్రీరామనవమి పనులు ప్రారంభం

● సంప్రదాయబద్ధంగా పసుపు దంచే వేడుక
● వసంతోత్సవంలో 'వరాల రామయ్య'
● శ్రీ సీతారాములకు వైభవంగా డోలోత్సవం



పంచామృతంతో స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



పసుపు కొమ్ములను దంచుతున్న ముత్తయిదువలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని మిథిలా స్టేడియంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవ శోభ ప్రారంభమైంది. ముక్కోటి వేడుకలు జరిగే ఉత్తర ద్వారం వద్ద స్వామివారి ఉత్సవ మూర్తులు దర్శనమివ్వడంతో భక్తులు పులకించిపోయారు. వారు చేసిన శ్రీరామ నామస్మరణలతో ఆ ప్రాంతం పులకించింది. ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా బేడా మండపంలో జరిగిన వసంతోత్సవంతో భద్రాద్రి రామయ్య పెళ్లి కుమారుడిగా మురిసిపోయాడు. భక్తుల జయజయధ్వానాలు, అర్చకుల వేదమంత్రాలు, మేళతాళాల నడుమ ఊంజల్ సేవ నిర్వహించగా స్వామివారు పరమానందభరితులయ్యారు. వెరసి.. మంగళవారం భద్రాచలంలో ఉత్సవ శోభ సంతరించుకుంది.

సంప్రదాయబద్ధంగా తలంబ్రాల తయారీ..

రామయ్య కల్యాణానికి వినియోగించే తలంబ్రాల తయారీని ప్రతి సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమి రోజున చిత్రకూట మండపంలో నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది ఆ క్రతువును ఉత్తర ద్వారం వద్దకు మార్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ పల్లకీ సేవగా స్వామివారి ఉత్సవమూర్తులను ఉత్తర ద్వారం వద్దకు తీసుకొచ్చి ఆశీనులను చేశారు. అర్చకులు, వేద పండితులు స్వామి, అమ్మవార్లకు, రోళ్లు, రోకళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల, వేద పండితుల సతీమణులు, శ్రీవైష్ణవ ముత్తయిదువలు తొలుత పసుపు కొమ్ములను దంచి పెళ్లి పనులు ప్రారంభించారు. అనంతరం బియ్యంలో పసుపు, రోజ్‌వాటర్, గులామ్, సుగంధద్రవ్యాలు, అత్తరు పోసి తలంబ్రాలు కలిపారు. మొదట తయారుచేసిన తలంబ్రాలను ఆలయ అధికారులు తలపై ధరించి స్వామివారి మూలమూర్తుల పాదాల చెంతన ఉంచారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన తలంబ్రాల తయారీలో పాల్గొన్నారు.

వైభవోపేతంగా డోలోత్సవం, వసంతోత్సవం..

ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా భద్రాద్రి రామయ్యకు వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించారు. బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు పంచామృతాలతో కలశాభిషేకం, సహస్రధారతో స్నపనం జరిపించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఊయలపై శ్రీ సీతాలక్ష్మణసమేతుడైన రామచంద్రస్వామి వారిని ఆశీనులను చేశారు. ఆస్థాన గాయకులు రామదాసు కీర్తనలను ఆలపిస్తుండగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి నక్షత్ర హారతి సమర్పించారు. అర్చకులు శ్రీ సీతారాములపై రంగులు చల్లి వసంతోత్సవాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులపై అర్చకులు, సిబ్బంది పసుపునీళ్లు, రంగులు చల్లారు. ఈ సందర్భంగా బేడా మండపం రంగుల మయంగా మారింది. ఆలయ సిబ్బంది సైతం ఆనందోత్సాహాలతో రంగులు చల్లుకున్నారు.

గోటి తలంబ్రాలతో తరలివచ్చిన భక్తులు..

స్వామివారి తలంబ్రాలను కలిపే వేడుకకు పలు జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తాము గోటితో వలిచిన తలంబ్రాలను కల్యాణ తలంబ్రాలలో కలిపి భక్తిని చాటుకున్నారు. ప్రత్యేక బస్సులు, ప్రైవేటు వాహనాల్లో కొందరు, పాదయాత్రగా మరి కొందరు తరలిరాగా, ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. బహిరంగ ప్రదేశంలో నిర్వహిస్తున్న ఈ క్రతువుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని తెలిసినా.. ఆలయ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది ఆ మేరకు బందోబస్తు ఏర్పాటు చేయకపోవడంతో కొంత తోపులాట చోటుచేసుకుంది. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, స్థానాచార్యులు స్థలశాయి, వేదపండితులు, అర్చకులు, ఆర్‌డీఓ రత్నకళ్యాణి, ఆలయ ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమెర్దలో మలేరియా అధికారి పర్యటన

అశ్వాపురం: మండలంలోని అమెర్ద గ్రామంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో మంగళవారం ఆ గ్రామాన్ని జిల్లా సహాయ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు సందర్శించారు. వైద్యాధికారి సంకీర్తన ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ జ్వర పీడితుల వివరాలు తెలుసుకున్నారు. జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించి మందులు అందజేశారు. 51 మందికి పరీక్షలు చేసి 8 మంది రక్త నమూనాలు సేకరించారు. గ్రామంలో దోమల మందు పిచికారీ చేయించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా కోఆర్డినేటర్ కృష్ణయ్య, సీహెచ్‌ఓ కాంతమ్మ, హెచ్‌వీ ఝాన్సీ, హెచ్‌ఏలు కిరణ్, రాజేశ్, తిరుపతమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



దోమలమందు పిచికారీ చేయిస్తున్న వెంకటేశ్వర్లు

రాజ్యహింసకు వ్యతిరేకంగా జరుపుకుందాం

చర్ల: అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని మహిళలపై జరిగే రాజ్యహింస, బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా జరుపుకుందామని మావోయిస్టు పార్టీ అనుబంధ ఆదివాసీ విప్లవ మహిళా సంఘం, విప్లవ మహిళా సంఘం బాధ్యులు పిలుపునిచ్చారు. మంగళవారం చర్ల శివారులో కరపత్రాలు వదిలారు. దోపిడీ పాలకవర్గాలు బ్రాహ్మణీయ హిందుత్వ భూస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తూ పోరాట స్ఫూర్తిని తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. అన్ని రంగాల్లో మహిళలు పోటీ పడుతున్నట్లు చెబుతున్నా వారిపై కుటుంబ హింస, రాజ్యహింస తగ్గడం లేదని పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న అన్నిరకాల హింసలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని మంగళ వారం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక రింగ్‌రోడ్ సెంటర్లో ఎస్‌ఐ రాజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా దమ్మపేట మండలం మొద్దులగూడెం గ్రామం నుంచి 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని డీసీఎం వ్యాన్‌లో ఏపీలోని కాకినాడ పోర్టుకు తరలిస్తుండగా పట్టుకున్నారు. దీనిపై సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇవ్వగా, అధికారులు పరీక్షించి రేషన్ బియ్యంగా నిర్ధారించారు. రేషన్ బియ్యాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న మొద్దులగూడేనికి చెందిన జింగాల యజ్ఞేశ్వర్‌తోపాటు డీసీఎం వ్యాన్ డ్రైవర్ డేగల సతీశ్‌పై కేసు నమోదు చేసి వ్యాన్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సర్పంచ్‌ను హతమార్చిన మావోయిస్టులు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా పొంగభేజి గ్రామ సర్పంచ్ పూనెం సన్నాను మావోయిస్టులు మంగళవారం దారుణంగా హత్య చేశారు. జిల్లాలోని రబ్రీపారా సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంటి దగ్గర ఉన్న సన్నాను అపహరించిన మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నేపంతో కర్రలతో దాడి చేసి హతమార్చారు.

దొంగనోట్ల కలకలం

● వయసు మళ్లిన చిరువ్యాపారులే టార్గెట్
● బెల్టుషాపుల్లో చెలామణీ

అశ్వారావుపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హైసెక్యూరిటీ కరెన్సీని మరిపించేలా దొంగనోట్లు తయారయ్యాయి. కొద్ది రోజులుగా అశ్వారావుపేటలో రూ.200 నోట్లు నకిలీవి చెలామణి అవుతున్నాయి. వయసుమళ్లి.. ఎవరి మీదా ఆధారపడకుండా జీవనోపాధికోసం వీధుల్లో కిరాణా దుకాణాలు, పాన్‌షాపులు, పాల కేంద్రాలు, టీ దుకాణాలు, బెల్టుషాపులు, కూల్‌డ్రింక్ షాపులు, జ్యూస్ సెంటర్లు, కొబ్బరిబొండాల విక్రేతలను మోసగాళ్లు టార్కెట్ చేస్తున్నారు. అశ్వారావుపేట విశాఖ, హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉండటంతోపాటు ఏపీ నుంచి భద్రాచలం వెళ్లే భక్తులకు ముఖద్వారంగా ఉంది. దీంతో కొత్తవారు వచ్చేందుకు ఎక్కువ అవకాశం ఉంది. దీనిని ఆసరాగా చేసుకున్న ఇతర ప్రాంతాల వారు తెల్లవారుజామున, రాత్రి వేళల్లో వ్యాపారం రద్దీగా ఉండే సమయంలో దొంగనోట్లను చెలామణి చేస్తున్నారు. కష్టపడే చిరువ్యాపారులు.. తమ శ్రమ, పెట్టుబడి దొంగనోట్ల పాలైందని గ్రహించి కన్నీటి పర్యంతమవుతున్నారు. అశ్వారావుపేటలో కొత్తగా సంచరించే వారిపై పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు. కాగా, ఈ అంశంపై సీఐ బాలకృష్ణను వివరణ కోరగా దొంగనోట్ల విషయం ఇప్పటివరకు తమ దృష్టికి రాలేదని తెలిపారు. ఇక నుంచి దీనిపై నిఘా పెడతామని తెలిపారు.



అశ్వారావుపేటలో బయటపడిన దొంగనోటు

నవ లిమిటెడ్‌కు 'బెస్ట్' అవార్డు



మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నిఖిల్

పాల్వంచ: పాల్వంచలోని నవ లిమిటెడ్‌కు బెస్ట్ సీఎస్సార్ ప్రాక్టీసెస్ అవార్డు లభించింది. మంగళవారం ఐటీసీ బేగంపేటలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నిఖిల్ దేవినేని, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ శ్యాం సుందర్ ప్లాటినం ట్రోఫీని అందుకున్నారు. రామవరంలో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్, సురక్షిత మంచినీటి కేంద్రం ఏర్పాటు, నవభారత్ కంటి వైద్య కేంద్రంలో ఆధునిక పరికరాల ఏర్పాటు, పలు గ్రామాలు, పాఠశాలల్లో మంచినీటి కేంద్రాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు నిర్మించడం, విద్యార్థులకు డ్యూయల్ డెస్కులు, స్పోకెన్ ఇంగ్లిష్, ఉచిత ట్యూషన్‌లు, కంప్యూటర్ టీచర్ల నియామకం, మౌలిక వసతుల కల్పనకు గాను ఈ అవార్డు లభించిందని సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎల్.వెంకట శరత్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.